క్లుప్తంగా

రైల్వే స్టేషన్‌లో పురపాలక శాఖ మంత్రి



మంత్రికి స్వాగతం పలికిన రైల్వే సూపరింటెండెంట్ శ్రీధర్

సామర్లకోట: రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ శుక్రవారం సాయంత్రం స్థానిక రైల్వే స్టేషన్ కు వచ్చారు. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, స్టేషన్ సూపరింటెండెంట్ బి.శ్రీధర్ స్వాగతం పలికారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు మంత్రిని కలిశారు. కాకినాడలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన సామర్లకోట నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ వెళ్లారు.

బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన ట్రాఫిక్ పోలీసులు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన ట్రాఫిక్ ఎస్సై

సామర్లకోట: పెద్దాపురంలోని ఒక ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్న సూర్య అనే విద్యార్థి శుక్రవారం ఇంటి వద్ద అలిగి సైకిల్‌పై ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా వెళుతున్నాడు. అనుమానం వచ్చిన ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు విద్యార్థిని పిలిచి వివరాలు సేకరించారు. దాంతో స్కూల్‌కు వెళ్లకుండా ఇంటి నుంచి వచ్చేవేసినట్టు చెప్పాడు. దాంతో ఎస్సై తల్లిదండ్రులు అనుష, వినోద్‌లకు సమాచారం ఇచ్చారు. తల్లి దండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి బాలుడిని అప్పగించారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



వ్యవసాయ,కార్మిక జిల్లా మహాసభల్లో మాట్లాడుతున్న శేఖర్

సామర్లకోట: కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వ నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ, కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. సీపీఐ జిల్లా మహాసభల సందర్భంగా స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ నెల 25 నుంచి 27 వరకు వ్యవసాయ, కార్మికుల రాష్ట్ర మహాసభలు బాపట్లలో జరుగుతాయని తెలిపారు. జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బొడకొండ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు తాటిపాక మధు, స్థానిక నాయకులు పెదిరెడ్ల సత్యనారాయణ, మడగల రమణ, ఎలిశెట్టి రామదాసు, పప్పు ఆదినారాయణ పాల్గొ న్నారు. అంతకుముందు సీపీఐ జెండాను ఆవిష్కరించారు.

పుస్తక పఠనాన్ని పెంపొందించుకోవాలి



శ్రీ ప్రకాష్‌లో పుస్తకావిష్కరణ చేస్తున్న రమేష్ తదితరులు

పెద్దాపురం: ప్రతీ ఒక్కరూ పుస్తక పఠనాన్ని పెంపొందించుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.రమేష్ అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో శుక్రవారం చికాగోకి చెందిన నిషాంత్ ఇంజమ్ రచించిన ×ద బెస్ట్ పాజుబుల్ ఎక్స్‌పీరియన్స్ స్టోరీస్₹ పుస్తకావిష్కరణ రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల హెచ్‌ఓడీ పి.శ్రీశైల శాస్త్రీ అధ్యక్షతన జరిగింది. పుస్తక రచయిత నిషాంత్ ఇంజమ్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంపై అభిలాష కలిగి ఉండాలన్నారు. ఖమ్మం న్యూయారా గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ ఇంజమ్ వెంకట రమణారావు, శ్రీ ప్రకాష్ పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

పిఠాపురం: దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేసారు. పిఠాపురం మండలం పి.తిమ్మాపురం, పి.రాయవరం గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన నాయకులు స్థానికులతో మాట్లాడారు. స్థానికంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కేఎస్ శ్రీనివాస్, కె.సింహాచలం, కాలదారి రాఘవ, ఊబా బుల్లిబ్బాయి, బత్తుల నాగరాజు, లోవరాజు, సుబ్బారావు, బి.నాగేంద్ర, ఎన్.స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు సేవా నిలయాలు

- ప్రజల వద్దకే పాలన అందిస్తున్న వైనం
- ప్రభుత్వ పథకాలకు అర్హుల గుర్తింపు
- సమయం, డబ్బు ఆదా

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల వద్దకే పాలన అందించాలనే లక్ష్యంతో సచివాలయాలను ఏర్పాటు చేశారు. గ్రామస్థాయిలో ప్రతి రెండు వేల జనాభాకు సచివాలయాలను ఏర్పాటు చేయగా మున్సిపాలిటీల పరిధిలో ప్రతి రెండు వార్డులకు ఒక సచివాలయం ఏర్పాటు చేసి భవనాలను నిర్మించారు. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో 74 సచివాలయాలు ఉన్నాయి. ప్రతీ సచివాలయంలోను 8 నుంచి 10 మంది సిబ్బందిని నియమించారు. వారిని ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారు. ఈ సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు అందించే విధంగా ప్రతీ 50 కుటుంబాలకు ఒక వలంటీరును నియమించారు. వలంటీరు లబ్ధిదారుల సమస్యలను గుర్తిస్తున్నారు. ఆ సమాచారం ఆధారంగా సచివాలయ కార్యదర్శులు లబ్ధిదారుల వద్దకు వచ్చి ఆయా యాప్‌ల ద్వారా ప్రభుత్వ పథకాలు అందే విధంగా చేస్తున్నారు. గతంలో ప్రజలు మున్సిపల్, రెవెన్యూ, మండల పరిషత్తు, విద్యాశాఖ, మండల సమాఖ్య కార్యాలయాల వద్దకు వెళ్లవలసి వచ్చేది. సచివాలయ వ్యవస్థతో గ్రామాలోనే ప్రజలకు సేవలు అందుతున్నాయి. ఇంటి పన్నుల చెల్లింపు, కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రాలు, రేషన్ కార్డుల మంజూరు, రైతులకు కావలసిన సేవలను సచివాలయాల్లో అందిస్తున్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా...

రాష్ట్రంలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. ఇతర రాష్ట్రాలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు సచివాలయాలను సందర్శిస్తున్నారు. గతంలో సామాజిక పింఛన్ల కోసం పడిగాపులు పడవలసి ఉండగా ప్రతీ నెలా వేకువ జామునే ఇళ్లకు వచ్చి పింఛన్లు అందజేస్తున్నారని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఉండూరు గ్రామంలోని సచివాలయం

ఇటువంటి పరిపాలన వస్తుందని ఊహించలేదు



ప్రజల ముంగిటకు పాలన వచ్చే విధంగా సచివాలయ వ్యవస్థ వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. విద్యార్థులకు కావలసిన వివిధ సర్టిఫికెట్లు సచివాలయ వ్యవస్థ ద్వారా అందుతున్నాయి. గ్రామంలో సమస్యలను వలంటీర్లు గుర్తించి సచివాలయ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం ద్వారా వెంటనే పరిష్కారం అవుతున్నాయి. – నాతి అప్పయ్యమ్మ, వీకే రాయపురం, సామర్లకోట మండలం

ప్రభుత్వ పథకాలు వివరిస్తున్నారు



ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వచ్చి వివరిస్తున్నారు. పథకాలు అందడానికి కావలసిన సర్టిఫికెట్లు వారే తయారు చేసి ఇస్తున్నారు. వేకువ జామునే పింఛన్లు ఇంటికి తీసుకొని ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది.

– మచ్చా సూర్యకాంతం, లబ్ధిదారు, వీకే రాయపురం

జగనన్నే నాకు అండ

స్థానిక 27వ వార్డు సాయినగర్‌కు చెందిన అక్కిరెడ్డి సత్తిబాబును భార్య, పిల్లలు 18 ఏళ్ల క్రితం వదలి వేయడంతో మానసికంగా బాధపడుతున్నాడు. సుమారు 16 ఏళ్ల క్రితం పోలియోతో కాళ్లు, చేతులు లాగి వేశాయి. అప్పట్లో దివ్యాంగ పింఛను కోసం దరఖాస్తు చేసినా ఫలితం కనిపించలేదు. ఇటీవల సచివాలయ వలంటీరు, కార్యదర్శులు ఇంటింటి సర్వేకు వచ్చిన సమయంలో దివ్యాంగ సర్టిఫికెటు, రేషన్‌కార్డుకు దరఖాస్తు చేశారు. సదరన్ సర్టిఫికెట్, రేషన్‌కార్డు మంజూరయ్యాయి. దాంతో నెలరోజుల క్రితం పింఛను కోసం దరఖాస్తు చేయగా ఈ నెల కొత్త పింఛను రూ.మూడు వేలు వచ్చింది. దాంతో జగనన్నే నాకు అండ అంటూ సత్తిబాబు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. ఎటువంటి ఆధారం లేని నాకు పింఛన్‌తో జీవించడానికి భరోసా ఏర్పడిందని, జగన్‌మోహన్ రెడ్డి మేలు ఎన్నటికీ మరచిపోలేనని అంటున్నాడు.



కొత్తగా పింఛను అందుకున్న పోలియో వ్యాధిగ్రస్తుడు సత్తిబాబు

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న మరిడమ్మ వారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిర్లక్ష్య డ్రైవింగ్‌కు ఆరు నెలల జైలు

సామర్లకోట: నడిచి వెళుతున్న వ్యక్తిని బైక్‌పై వేగంగా వచ్చి బలంగా ఢీ కొట్టిన కేసులో ముద్దాయి గుబ్బల అశోక్‌కు కాకినాడ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ ఉషాలక్ష్మికుమారి ఆరు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు. స్థానిక మెహర్ కాంపెక్స్ సమీపంలో 2021 జూన్ 24వ తేదీన ఇందన వీర వెంకట సత్యనారాయణ రోడ్డుపై నడిచి వెళుతుండగా అశోక్ నిర్లక్ష్యంగా బైక్ నడిపి అతను తీవ్ర గాయాల పాలవ్వడానికి కారణమయ్యాడు. దీనిపై అప్పటి ఎస్ఐ సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పునిచ్చినట్లు సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

ఉత్సవాల ముసుగులో అల్లర్లకు పాల్పడితే చర్యలు

- నియమ, నిబంధనల మేరకు గణపతి నవరాత్రులు
- 18న సామర్లకోటలో జిల్లా స్థాయి పోలీస్ స్పందన
- పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

పెద్దాపురం: గణపతి నవరాత్రుల ముసుగులో అసాంఘిక కార్యక్రమాలు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి హెచ్చరించారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నవరాత్రులను సామరస్యంగా నిర్వహించుకోవాలన్నారు. అల్లర్లు సృష్టించాలని చూస్తే సహించేది లేదన్నారు. ప్రతీ వినాయక కమిటీ పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఆలయ కమిటీలు ఏర్పాటు చేసిన మంటపాల వద్ద రాత్రి వేళ కమిటీకి చెందిన వ్యక్తి ఒకరు ఉండాలన్నారు. విగ్రహం ఏర్పాటు వల్ల ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవాలు ప్రారంభమైన నాటి నుంచి నిమజ్జనం వరకు కమిటీ సభ్యులు జాగ్రత్తలు పాటించాలన్నారు. పోలీసుల అనుమతితోనే నిర్దేశించిన స్థలాల్లో నిమజ్జన వేడుకలు జరపాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలో గణపతి నవరాత్ర ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ప్రతీ వారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించే పోలీస్ స్పందన కార్యక్రమం ఈ నెల 18వ తేదీన సామర్లకోట పోలీస్ స్టేషన్ వద్ద జరుగుతుందని, జిల్లావాప్తంగా పోలీస్ స్పందనకు వచ్చే అర్జీదారులు సామర్లకోటకు వచ్చి తమ అర్జీలను అందజేయవచ్చన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ నిర్వహించే పోలీస్ స్పందన కార్యక్రమాన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ కోరారు. జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు, గండేపల్లి ఎస్ఐ వై.గణేష్‌కుమార్, ఏఎస్ఐ కృష్ణ తదితరులున్నారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పింఛన్

ఏపీ హౌసింగ్ చైర్మన్ దవులూరి

పెద్దాపురం: అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి వైఎస్సార్ ఆసరా కింద పింఛన్లు మంజూరు చేస్తామని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని కాండ్రకోట, మర్లావ, సిరివాడ గ్రామాల్లో శుక్రవారం నూతనంగా మంజూరైన పింఛన్లను జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజాలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన పింఛన్ల పంపిణీ సభలో హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అవ్వాతాతలకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అవ్వాతాతలు, వితంతువు, వికలాంగులకు ఠంచన్‌గా ఒకటో తేదీన పింఛన్ అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. గత ప్రభుత్వంలో ఎవరైనా చనిపోతే గాని కొత్తగా పింఛన్లు మంజూరు చేసే అవకాశం ఉండేది కాదన్నారు, ప్రస్తుత ప్రభుత్వంలో అర్హత ఉంటే సత్వరమే పింఛన్ మంజూరు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ, ప్రస్తుత ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకుని రానున్న ఎన్నికల్లో పింఛన్ లబ్ధిదారులందరూ వైఎస్సార్ సీపీకి ఓటేసి మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని దొరబాబు కోరారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు భద్రరావు, ఉప సర్పంచ్ జోకా నానాజీ, సొసైటీ అధ్యక్షుడు పల్ల గంగారావు, గంటా రామస్వామి, లక్కాకుల కృష్ణ, గవరసాని రాజశేఖర్, మద్దూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మర్లావలో పింఛన్ అందజేస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పోషకాహారంపై అవగాహన పెరగాలి

సామర్లకోట: బాలింతలు, గర్భిణులు పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజరు ఎండీ సుల్తాన్‌బీబీ అన్నారు. శుక్రవారం స్థానిక 14వ వార్డులో పోషణ మహా వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గుడ్లు, పోషక విలువతో ఉన్న ఆహార పదార్థాలను అందజేస్తామని ఆమె తెలిపారు. అయితే వాటిని వారి కుటుంబ సభ్యులకు ఇస్తున్నట్లు తాము గుర్తించామన్నారు. ఈ పద్ధతి నుంచి గర్భిణులు, బాలింతలు బయటకు రావాలన్నారు. ప్రతీ రోజు చిరుధాన్యాలు ఆహారంలో ఉండే విధంగా చూచుకోవాలన్నారు. కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఎన్ఎం కమల, అంగన్‌వాడీ టీచర్లు పి.నాగరత్నం, జి.దుర్గాదేవి, వి.సీతాదేవి, బి. భారతలక్ష్మి, జి.అన్నవరం, పి.రాజేశ్వరి పాల్గొన్నారు.

భక్తితత్వం పెంపొందాలి

- హైందవ ధర్మానికి మచ్చ తేవద్దు
- నవరాత్రుల్లో అనాగరిక చర్యలు వద్దు
- నియోజకవర్గ గణపతి ఉత్సవ కమిటీల సమావేశంలో వక్తల పిలుపు

పిఠాపురం: వినాయక నవ రాత్రి ఉత్సవాలు భక్తి పూర్వకంగా ఉండకూడదని శ్రీబాల గంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవ కమిటీ సూచించింది. నియోజకవర్గ గణేష్ ఉత్సవ కమిటీల సమావేశంలో శ్రీబాల గంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, రాము, లక్ష్మణ్ తదితరులు మాట్లాడారు. సనాతన ధర్మంలో ఆదిదేవుడు గణపతి పూజతో (వినాయక చవితి) పండుగలు ప్రారంభమవుతాయన్నారు. అటువంటి ప్రాముఖ్యం ఉన్న ఉత్సవంలో అనాగరిక చర్యలకు పాల్పడుతూ సంప్రదాయాలను తుంగలో తొక్కి భక్తిని పక్కన పెట్టి తాగి ఊడితే మన హైందవ ధర్మానికి చెడ్డపేరు వస్తుందన్నారు. గణపతి పందిళ్లలో సినిమా పాటలు పెట్టి భక్తితత్వాన్ని పాడుచేయవద్దని హితవు పలికారు. నిమజ్జనాల సమయంలో కూడా మద్యం మత్తులో ఊరేగుతూ ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని ఆయన అన్నారు. నవరాత్రుల్లో కేవలం భక్తి పాటలు, ప్రవచనాలు, ఉపన్యాసాలు, ఇతర సంప్రదాయ కళలకు మాత్రమే చోటు ఇవ్వాలని వారు సూచించారు. అలాగే శబ్ద కాలుష్యం లేకుండా ఆడియో సిస్టంలు పెట్టుకోవాలని ఆయా కమిటీల నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో సురేంద్ర దత్త, దడాల నాని, రాజశేఖర్, కొండేపూడి శివ, శ్రీనివాసరావు, ఓబ్ సాంగ్ డియోరా, అరిగెల ప్రసాదరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కోలాహలంగా క్రీడాపోటీలు



సామర్లకోటలో బాలికల క్రీడా పోటీల విజేతలతో ఫిజికల్ డైరెక్టర్లు

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం మండల స్థాయి బాలికలకు నిర్వహించిన ఆట పోటీలు కోలాహలంగా సాగాయి. 300 మంది హాజరు అయినట్టు ఫిజికల్ డైరెక్టర్ యార్లగడ్డ బంగార్రాజు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, యోగా టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, షటిల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను మండల విద్యాశాఖాధికారులు వై.శివరామకృష్ణయ్య, పి.పులయ్య ప్రారంభించారు. మండల స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ శివరామకృష్ణయ్య తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీదేవి, వెంకటేశ్వర్లు, వైకుంఠం, జయలక్ష్మి, అరుణ, వీరబాబు, గోవిందు, ఇబ్రహీం, సునైనా, సత్యగౌరీలు పోటీలను నిర్వహించారు. బాలుర విభాగంలో కబడ్డీలో పీబీదేవం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం, మేడపాడు విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. వాలీబాల్‌లో మేడపాడు ప్రథమ, సామర్లకోట జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాల ద్వితీయ స్థానం గెలుచుకున్నారు. త్రోబాల్‌లో నవర ప్రథమ, సామర్లకోట యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఖోఖోలో యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. టెన్నికాయిట్ డబుల్స్‌లో చంద్రంపాలెం ప్రథమ, నవర ద్వితీయ, సింగిల్స్‌లో చంద్రంపాలెం ప్రథమ, నవర ద్వితీయ స్థానాలను సాధించినట్టు బంగార్రాజు వివరించారు. బాలికల విభాగంలో కబడ్డీలో ఉండూరు ప్రథమ, జి.మేడపాడు ద్వితీయ, వాలీబాల్‌లో మేడపాడు ప్రథమ, త్రోబాల్‌లో యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్ ప్రథమ, నవర ద్వితీయ, ఖోఖోలో యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్ ప్రథమ స్థానం సాధించాయి. టెన్నికాయిట్‌లో ఉప్పరగూడెం ప్రథమ, నవర ద్వితీయ స్థానాలు సాధించాయని తెలిపారు.

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో పెద్దాపురం చిన్నారి



ఆన్‌లైన్‌లో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థి శ్రీహాస్



విద్యార్థి శ్రీ హాస్‌కి అందిన సర్టిఫికెట్

పెద్దాపురం: ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో పెద్దాపురం పట్టణానికి చెందిన చిన్నారి మహంకాళి శ్రీహాస్ స్థానం సాధించాడు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు పెద్ద ఎత్తున విచిత్ర వేషధారణ పోటీలను నిర్వహించింది. ఇందుకు ఆన్‌లైన్‌లో ఎంట్రీలను స్వీకరించింది. సుమారు 12,600 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఎంట్రీలు పంపారు. పెద్దాపురానికి చెందిన యూకేజీ విద్యార్థి శ్రీహాస్ ఈ అవార్డుకు ఎంపికయ్యాడు. స్థానిక ప్రసన్నాంజనేయనగర్‌కు చెందిన మహంకాళి శ్రీకాంత్, హస్మి దంపతుల కుమారుడు శ్రీహాస్. మెడల్, మెమెంటో, సర్టిఫికెట్, జాతీయ జెండాలను తపాలా శాఖ ద్వారా విద్యార్థి తల్లిదండ్రులకు నిర్వాహకులు అందజేశారు.

అదనపు జిల్లా జడ్జిలుగా పదోన్నతులు

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలువురు సీనియర్ సివిల్ జడ్జిలను పదోన్నతిపై అదనపు జిల్లా జడ్జిలుగా బదిలీ చేస్తూ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీనివాసరావును పదోన్నతిపై కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జిగా నియమించారు. రాజమహేంద్రవరం 8వ అదనపు జిల్లా జడ్జి పీఆర్ రాజీవ్ బదిలీపై రాజమహేంద్రవరం ఒకటో అదనపు జిల్లా జడ్జి కోర్టుకు వెళ్లారు. ఆయన స్థానంలో తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వై.బెన్నయ్య నాయుడు పదోన్నతిపై రాజమహేంద్రవరం 8వ అదనపు జిల్లా జడ్జిగా నియమించారు. పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి టి.ఎస్.సరస్వతి పదోన్నతిపై నెల్లూరు 5వ అదనపు జిల్లా జడ్జిగా నియమించారు. గుంటూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ జి.చంద్రమౌళేశ్వరికి పదోన్నతిపై పెద్దాపురం ఏడో అదనపు జిల్లా జడ్జిగా నియమించారు.

విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం

జెడ్పీటీసీ సభ్యుడు లోవరాజు



స్కూలు గేమ్స్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు లోవరాజు

పిఠాపురం: విద్యార్థులకు చదువుతో పాటు మానసిక శారీరక బలం చేకూరాలనే సంకల్పంతో ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోందని గొల్లప్రోలు జెడ్పీటీసీ సభ్యుడు వులవకాయల నాగ లోవరాజు అన్నారు. మండలం చేబ్రోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన మండల స్థాయి స్కూలు గేమ్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో గతంలో ఏదైనా స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే వంటి సమయాలలో మాత్రమే క్రీడలు జరిగేవని, కాని ఇప్పుడు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆటల పోటీలు పెట్టి మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి పంపుతుండడంతో విద్యార్థులు తమకు ఇష్టమైన ఆటల్లో ప్రావీణ్యం సంపాదించడానికి ఉత్సాహం చూపుతున్నారన్నారు. అనంతరం క్రీడాకారుల ఎంపికను క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేబ్రోలులో చోరీ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఒక ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం చేబ్రోలుకు చెందిన తేటకాయల వెంకట సత్యనారాయణ గురువారం తన ఇంటికి తాళం వేసుకుని తన తండ్రి ఇంటికి వెళ్లి మరునాడు వచ్చారు. శుక్రవారం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు బద్దలుకొట్టి ఉండడం చూసి లోపలకి వెళ్లి చూడగా ఇంట్లో బీరువాలో ఉన్న రూ. 1.4 లక్షల విలువైన బంగారు నగలు దోచుకుపోయినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈవోల వద్ద సమాచారం ఉండాలి

బోట్‌క్లబ్: దేవాలయాలు, సత్రాలకు సంబంధించిన పూర్తి డేటా ఈవోల వద్ద ఉండాలని దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్ అన్నారు. కాకినాడ డివిజన్‌లోని ఈవోలతో శుక్రవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దేవదాయశాఖ గతంలో ఇచ్చిన ఫారం–1లో ఈ వివరాలు నమోదు చేయాలన్నారు.

ఇంటింటికీ ఆరోగ్య సురక్ష



సామర్లకోటలో ఆరోగ్య సురక్ష కరపత్రాలు అందజేస్తున్న కౌన్సిలర్, హెల్త్ సిబ్బంది

కొత్తపల్లి: వైద్య, ఆరోగ్య రంగాన్ని ప్రభుత్వం బలోపేతం చేస్తోందని, ఇప్పటికే గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా సొంత ఊరిలోనే వైద్యం అందుకునేలా చర్యలు చేపట్టారని సర్పంచ్ బండి రాణి అన్నారు. మండలంలోని పొన్నాడలో శుక్రవారం నాగులాపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారి సౌజన్య అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. సర్పంచి మాట్లాడుతూ ఇంటింటికీ వలంటీర్లు , వైద్య సిబ్బంది వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించి అవసరమైన వైద్యసాయం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎగ్జిక్యూటర్ కృష్ణారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



పొన్నాడలో జగనన్న ఆరోగ్య సురక్ష ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వార్డులోను ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే శుక్రవారం ప్రారంభం అయింది. సచివాలయ హెల్త్ సిబ్బంది, కౌన్సిలర్లు, వలంటీర్ల ఆధ్వర్యంలో ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రారంభించారు. ఈ నెలాఖరు వరకు ప్రతి కుటుంబంలోని సభ్యుల ఆరోగ్యంపై సర్వే చేస్తామని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. అనారోగ్యంతో ఉన్నవారి వివరాలను సేకరించి ఈ నెల 30వ తేదీ నుంచి మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో జరిగే ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డాక్టర్లు పరీక్షలు చేసి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు మందులు అందజేస్తారని తెలిపారు.